

సబితారెడ్డిని కలిసిన నాయకులు

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని సోమవారం వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి తదితరులు ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పార్టీ బలోపేతంపై చర్చించారు. మాజీ మంత్రిని కలిసిన వారిలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు గూడూరు నర్సింగ్‌రావు, ప్రభాకర్, నాయకులు సందీప్‌రెడ్డి, అజయ్, నాగుల్ రెడ్డి, ఎల్లయ్య, మల్లేశ్, మాధవరెడ్డి, రాంప్రసాద్, గని, నరేందర్‌రెడ్డి, మాణిక్యా రెడ్డి, షఫీ, తదితరులు ఉన్నారు.

–షాబాద్/ధారూరు/చేవెళ్లటౌన్, అక్టోబర్ 14

అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక, వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యమిచ్చి సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణిలో ఆయన పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యలను పరిష్కరించాల న్నా రు. అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దన్నారు. 40 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లాలో 55 ఫిర్యాదులు

ధారూరు : ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్ ఆదేశించారు. సోమ వారం వికారాబాద్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కా ర్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 55 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

ట్రైసైకిల్ పంపిణీ

మొయినాబాద్, అక్టోబర్ 14 : అంగవైకల్యం శారీరానికే తప్ప బుద్ధికి కాదని.. బుద్ధి బలంతో దేనినైనా సాధించొచ్చని మాజీ మంత్రి పట్లోళ్ల సబితారెడ్డి అన్నారు. మండలంలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన మంగళారం కృష్ణకు షుగర్ వ్యాధి ఎక్కువై అతడి రెండు కాళ్లను ఇటీవల వైద్యులు తొలగించారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు అంజయ్యగౌడ్ సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన ఆమె కృష్ణకు చార్జింగ్‌తో కూడిన ట్రై సైకిల్‌ను సొంత నిధులతో కొనుగోలు చేసి.. సోమవారం వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దివ్యాంగులను ఆదుకోవాలని.. ఆపదలో ఉన్నవారికి తోచిన విధంగా సాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణగౌడ్, అంజయ్యగౌడ్, బాల రాజు, సుదర్శన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాజు, రాజు, షేక్ నహీమ్, శ్రీకాంత్, జైపాల్ గౌడ్, సత్తయ్య, కలీల్, జంగయ్య, రాజు, తులసి, మాధురి, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు నేవీ రాడార్ సెంటర్‌కు శంకుస్థాపన..ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

పూడూరు మండలంలోని దామగుండం అటవీ ప్రాంతంలో మంగళవారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్న నేవీ రాడార్ కేంద్రం స్థలాన్ని, అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులతో కలిసి పరిశీలించారు. అంతకు ముందు ఆయన కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జాతీయ భద్రత, ఇంటెలిజెన్స్, సెక్యూరిటీ బృందాలు, ఎస్పీ నారాయణరెడ్డి, నావికాదళ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అదేవిధంగా కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయనతో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి ఉన్నారు.

–ధారూరు, అక్టోబర్ 14

నేడు కౌన్సెలింగ్

డీఎస్సీ-2024కు ఎంపికైన అభ్యర్థులకు..

షాబాద్, అక్టోబర్ 14 : డీఎస్సీ-2024కు ఎంపికైన అభ్యర్థులకు నేడు ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ ఉంటుందని రంగారెడ్డి డీఈవో సుశీందర్ రావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, నియామక ఉత్తర్వును(ఒరిజినల్ కాపీని) తీసుకురావాలన్నారు. స్కూల్ అసిస్టెంట్, అన్ని ఉర్దూ మీడియం కేటగిరీల అభ్యర్థులందరికీ జిల్లా విద్యాశాఖ కార్యాలయం, రెండో అంతస్తు(S-27))నందు...అదే విధంగా అన్ని మీడియంల సెకండరీ గ్రేడ్ టీచర్(SGT) అభ్యర్థులకు గ్రౌండ్ ఫ్లోర్‌లోని మీటింగ్ హాల్‌లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

అందరి భద్రత..పోలీసుల బాధ్యత

● రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

మొయినాబాద్, అక్టోబర్ 14 : ప్రతి ఒక్కరి భద్రత పోలీసుల బాధ్యత అని.. ఫామ్‌హౌస్ నిర్వాహకులు బాధ్యతగా మెలగాలని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్‌లో మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఫామ్‌హౌస్ నిర్వాహకులతో మొయినాబాద్ పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఫామ్‌హౌస్ నిర్వాహకులు ట్రేడ్ లైసెన్సులను తప్పనిసరిగా గ్రామ పంచాయతీల నుంచి పొందాలన్నారు. ఫామ్‌హౌస్‌ల్లో ఈవెంట్లు నిర్వహించే వారు తప్పనిసరిగ్గా అనుమతి పొందాలన్నారు. ఫామ్‌హౌస్‌లకు వచ్చిన వారికి పూర్తి భద్రత కల్పించాలని.. వాటి పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమతుల్లేకుండా ప్రోగ్రామ్స్ నిర్వహిస్తే ఫామ్‌హౌస్‌లను సీజ్ చేస్తామన్నారు. సమావేశంలో చేవెళ్ల ఏసీపీ కిషన్‌రావు,. మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐలు నర్సింహారావు, ముజాపర్ అలీ, నహిముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

తైక్వాండోలో కాంస్య పతకం

మండలంలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఉన్న స్వామినారాయణ అంతర్జాతీయ గురుకుల పాఠశాల విద్యార్థికి తైక్వాండో నేషనల్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం వరించింది. అండర్ 14, 23 కేజీల విభాగాల్లో సీబీఎస్ఈ నేషనల్ చాంపియన్‌షిప్‌లో భాగంగా సౌత్‌జోన్‌కు సంబంధించి తైక్వాండో పోటీలను చెన్నైలోని నిర్వహించారు. వీటిలో స్వామినారాయణ గురుకుల పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్న మణికంటేశ్వరరెడ్డి పాల్గొని రజత పతకాన్ని గెలుచుకోవడంతో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ నేషనల్ కాంపీటిషన్స్ ఉత్తరాఖండ్‌లో జరుగగా.. అందులో అతడు కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా అతడిని పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

–మొయినాబాద్, అక్టోబర్ 14

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాల పంపిణీ

వచ్చే నెల14 వరకు కొనసాగనున్న ప్రోగ్రామ్

● రంగారెడ్డి జిల్లాలో 2,40,000 ఆవులు, 1,67,000 గేదెలు

● పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం రూరల్, అక్టోబర్ 14 : గాలికుంటు వ్యాధి నుంచి ఆవులు, గేదెలను కాపాడేందుకు ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలో నేటి నుంచి గాలికుంటు, నట్టల నివారణ టీకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నది. ఈ కార్యక్రమం వచ్చే నెల 14 వరకు కొనసాగుతుందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. కాగా జిల్లాలో 2,40,000 ఆవులు, 1,67,000 గేదెలను గుర్తించినట్లు.. వాటన్నింటికీ టీకాలను పంపిణీ చేస్తామన్నారు. మూగ జీవాలను అత్యంత ప్రమాదకరమైన గాలికుంటు వ్యాధి బారి నుంచి కాపాడేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు జిల్లాలో ఉన్న 27 మండలాల్లోని గ్రామాల వారీగా గాలికుంటు వ్యాధి టీకాలు పంపిణీ చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. ఇందుకోసం అధికారులు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. ప్రతి మండలంలోనూ రెండు బృందాలు నేటి నుంచి మూగ జీవాలకు టీకాలు వేయనున్నాయి

కలిగే అనర్థాలు..

- గాలికుంటు వ్యాధి క్యాన్సర్ కంటే ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు.
- ఈ వ్యాధి సోకిన వెంటనే పశువులకు 104, 105 డిగ్రీల జ్వరం ఉంటుంది.
- ఈ వ్యాధి సోకితే నోట్లో పుండ్లు అయి.. తినేందుకు ఇబ్బందిగా ఉంటుంది.
- పాడి పశువులకు సోకితే పాల ఉత్పత్తులు తగ్గిపోతాయి.
- సుడితో ఉన్న పశువులకు ఈ వ్యాధి సోకితే ఈడ్చుకుపోయే ప్రమాదముంది.
- ఈ వ్యాధి గాలి ద్వారా సోకుతుంది.
- ఈ వ్యాధి సోకిన పశువులకు టీకా వేస్తే వారం రోజుల వరకూ కోలుకునే అవకాశముండదు.

సమావేశంలో మాట్లాడుతున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

ఇంకుడు గుంత లేని ఇండ్లకు నోటీసులు

సిటీబ్యూరో, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ) : ఇంకుడు గుంత లేని ఇండ్లకు నోటీసులు జారీ చేయాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో కలిసి జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌పై సమీక్షించారు. సీవరేజీ ఓవర్ ఫ్లో, కలుషిత నీరు, రోడ్లపై సిల్ట్ తదితర వాటిపై ఎంసీసీకి వచ్చే ఫిర్యాదులను ఆయా క్యాన్ నంబర్లను జీపీఎస్ ఆధారంగా గూగుల్ మ్యాప్‌లో నమోదు చేస్తున్నట్లు ఎండీ తెలిపారు. మ్యాన్‌హోళ్లలో తీసిన వ్యర్థాలను (సిల్ట్) డంపింగ్ యార్డుకు తరలించాలని, డ్రై బోర్‌వెల్స్‌పై కొనసాగుతున్న సర్వేను వేగవంతం చేయాలని చెప్పారు. వినియోగదారులు తమ ఇళ్లల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని..లేకపోతే వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. వచ్చే జనవరి నుంచి ట్యాంకర్ బుక్ చేస్తే అదనపు చార్జీలు వసూలు చేస్తామన్నారు. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులకు ఎస్ఎంఎస్ రూపంలో పంపించడంతో పాటు నేరుగా వారికి పత్రాలు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు వీఎల్ ప్రవీణ్‌కుమార్, స్వామి, విజయరావు, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు పాల్గొన్నారు.

వామ్మో..ఆర్టీసీ బస్సు!

- ఎక్కాలంటేనే జంకుతున్న జనం
- పండుగ తర్వాత పట్టణాలకు తిరుగు పయనం
- జనంతో బస్సుల కిటకిట

కొడంగల్, అక్టోబర్ 14 : దసరా పండుగ, పాఠశాలలకు సెలవులు ముగియడంతో గ్రామాలకు చేరుకున్న ప్రయాణికుల తిరుగు ప్రయాణం కిక్కిరిసినట్లుగా కొనసాగుతున్నది. బంధువులు, వివిధ రకాల పనులు చేసుకుని హైదరాబాద్‌లో బతికే వారు తిరుగు ప్రయాణం అవుతుండడంతో ఆర్టీసీ బస్సులు జనంతో కిటకిటలాడుతున్నాయి. ఉచిత ప్ర యాణ సౌకర్యం ఉండడంతో మహిళలు ఆర్టీసీ బస్సులనే ఆశ్రయిస్తున్నారు. ఆ రద్దీని చూసి జంకుతున్న ప్రజలు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదు. సోమవా రం కొడంగల్ ఆర్టీసీ ప్రాంగణం ప్రయాణికులతో కిటకిటలాడింది. పండుగ సందర్భంగా సరిపడా బస్సులను ఏర్పాటు చేయలేదని కాంగ్రెస్ సర్కార్‌పై ప్రజలు దుమ్మెత్తిపోశారు. ఇక ముందైనా ఇటువంటి అసౌకర్య పరిస్థితు లు తలెత్తకుండా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల కిటకిట

విద్యుత్తు శాఖలో ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న వెండర్స్ సమస్యను పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ ముషారఫ్ ఫరూఖీని కలిసి విజ్ఞప్తి చేశారు. విద్యుత్తు శాఖ చేపట్టే కాంట్రాక్టు పనులను ఆ శాఖలో వెండర్స్‌గా నమోదైన కాంట్రాక్టర్లు చేపడుతుంటారు. కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలతో ఎన్నో ఏండ్లుగా కాంట్రాక్టు పనులు చేస్తున్న వారికి అన్యాయం జరుగుతున్నదని.. ఈ అంశాన్ని పరిశీలించి తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రతినిధులు కోరారు. సీఎండీని కలిసిన వారిలో తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కందుకూరి శ్రీనివాస్, మద్దునూరి వెంకటేశ్, మహేశ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, గడిగె సత్యనారాయణ ఉన్నారు.

–సిటీబ్యూరో, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ)

అన్నదాతలు టీకాలు వేయించాలి

ఆవులు, గేదెలు, ఎద్దులు, దూడలకు సీజనల్ వ్యాధులు సోకకుండా ఉండేందుకు అన్నదాతలు గాలికుంటు వ్యాధి టీకాలను వేయించాలి. నేటి నుంచి నెల రోజుల వరకు పశుసంవర్ధకశాఖ అధికారులు గ్రామాల్లోకి వచ్చి గాలికుంటు, నట్టల నివారణ టీకాలను పంపిణీ చేస్తారు. వాటిని రైతులు తమ మూగ జీవాలకు ఇప్పించాలి.

– శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

బదిలీల్లో భారీ అవినీతి!

- మార్గదర్శకాలకు తిలోదకాలు
- చేతులు మారిన లక్షలాది రూపాయలు
- కోరుకున్న చోటుకు పోస్టింగ్

సిటీబ్యూరో, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు శాఖలో బదిలీల మార్గదర్శకాలకు తిలోదకాలిచ్చారు. కోరుకున్న వారికి కోరుకున్న చోటే పోస్టింగ్ అనే నినాదం..అక్షరాల నిజమైంది. అవినీతికి చోటులేకుండా ఎంతో పారదర్శకంగా బదిలీ ప్రక్రియను చేపడుతున్నామని, అందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి, వెబ్‌కౌన్సెలింగ్‌ను ఎంప్లాయీస్ పోర్టల్ ద్వారా నిర్వహించామని ప్రకటించారు. బదిలీ కోసం ప్రత్యేకంగా రూపొందించిన మార్గదర్శకాలను లెక్క చేయకుండానే కొన్ని పోస్టులను తాము అనుకున్న వారికి అప్పగించేశారు. మొత్తంగా బదిలీల ప్రక్రియలో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. బదిలీలతో అసంతృప్తికి గురైన కొందరు ఉద్యోగులు ఖైరతాబాద్‌లోని దక్షిణ డిస్కం కార్యాలయానికి వచ్చి ఉన్నతాధికారులను కలిసేందుకు ప్రయత్నించినా అందుబాటులో లేకుండాపోయారు. తాజాగా సోమవారం దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థలో జరిగిన బదిలీల ప్రక్రియలో మొత్తం 1126 మందిని బదిలీ చేసినట్లు డిస్కం అధికారులు ప్రకటించారు. ఇందులో డీఈలు 111, ఏడీఈలు 263, ఏఈలు 521, ఇతర ఉద్యోగులు 231 పోస్టులకు సంబంధించిన బదిలీల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. బదిలీ జాబితాను నేరుగా ఉద్యోగులకే మెయిల్ ద్వారా సందేశాలు పంపించి, బయటకు మాత్రం బహిర్గతం చేయలేదు. బదిలీల జాబితా బహిరంగంగా ప్రకటించాల్సిన అధికారులు తాము చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే ఇలా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అందరి టార్గెట్ ఫోకల్ పోస్టులే..

బదిలీల ప్రక్రియ చాలా పారదర్శకంగా జరిగిందని ప్రకటిస్తున్నా... తెరవెనుక మాత్రం విద్యుత్తు శాఖ మంత్రి అనుచరులు పెద్ద ఎత్తున లాబీయింగ్ చేసి నచ్చిన ప్రాంతానికి పోస్టింగ్ వచ్చేలా చేయించారన్న ఆరోపణలున్నాయి. ఫోకల్ పోస్టుల్లో ఇప్పటివరకు పనిచేసిన వారికి మళ్లీ ఫోకల్ పోస్టులకు బదిలీ చేయకుండా మార్గదర్శకాలను రూపొందించారు. ఈ నిబంధనలను తుంగలో తొక్కి కీలకమైన పోస్టుల్లో పనిచేసిన వారికి మళ్లీ అలాంటి కీలక పోస్టుల్లోనే పోస్టింగ్ ఇచ్చారు. అందుకు ప్రత్యేక ఉదాహరణ కార్పొరేట్ కార్యాలయంలో డీఈ కమర్షియల్ ఈడీగా పనిచేస్తున్న అధికారిని మేడ్చల్ సర్కిల్ పరిధిలోని డీఈ ఆపరేషన్స్ పోస్టుకు బదిలీచేశారు. ఇలా ఈ ఒక్క పోస్టు మాత్రమే కాదు.. పదుల సంఖ్యలోనే ఉన్నాయి. ఫోకల్ పోస్టుల్లో పోస్టింగ్‌కు రూ.20 లక్షల నుంచి రూ. 80 లక్షల వరకు చేతులు మారినట్లు సమాచారం.

యూనియన్ నాయకులకు ఫోకల్ పోస్టులు..

బదిలీల కోసం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం విద్యుత్తు ఉద్యోగ సంఘాల్లో నాయకులుగా ఉన్న వారికి ఫోకల్ పోస్టింగులు ఇవ్వకూడదని ఉన్నది. కానీ తాజాగా జరిగిన బదిలీల్లో యూనియన్ నాయకులకు సైతం ఒకటి, రెండు చోట్ల పోస్టింగులు ఇచ్చినట్లు తెలిసింది. ఈ విషయంలోనూ సచివాలయం స్థాయిలో పైరవీలు చేసి, కావాల్సిన పోస్టును సొంతం చేసుకున్నారు. మొత్తంగా దక్షిణ డిస్కంలో జరిగిన బదిలీలు ఎన్నో ఆరోపణలకు తావిస్తున్నది.

ఫోకల్ టు ఫోకల్..

1. డీఈ కమర్షియల్ (కార్పొరేట్ ఆఫీస్) నుంచి డీఈ ఆపరేషన్స్ (మేడ్చల్)
2. ఏఈ (ఆపరేషన్)పటాన్‌చెరు నుంచి ఏఈ నార్సింగి
3. ఏఈ గచ్చిబౌలి నుంచి ఏఈ టెక్నికల్ గచ్చిబౌలి
4. ఏడీఈ బైరామల్‌గూడ నుంచి ఏడీఈ ఘట్‌కేసర్

ఒకే డివిజన్ పరిధిలో బదిలీలు..

బదిలీల కోసం రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం ఒకే డివిజన్‌లో పనిచేసిన వారికి అదే డివిజన్‌లో పోస్టింగ్ ఇవ్వకూడదు. కానీ ఆ నిబంధనను పట్టించుకోకుండా ఏడీఈ ఆపరేషన్ పటాన్‌చెరు నుంచి ఏడీఈ ఆపరేషన్ గుమ్మడిదల కు బదిలీ చేశారు. ఇది ఒకే డివిజన్‌లో పరిధిలోనే ఉన్నది. మార్గదర్శకాలకు విరుద్ధంగా ఈ బదిలీల ప్రక్రియ జరిగిందనానికి ఇదొక సాక్ష్యం. అదేవిధంగా డీఈ ఆపరేషన్ మేడ్చల్ నుంచి డీఈ టెక్నికల్ మేడ్చల్ పోస్టు సైతం ఒకే సర్కిల్‌లో ఉన్నది. ఈ పోస్టులు ఒకే సర్కిల్(మేడ్చల్)పరిధిలోని కావ డం గమనార్హం. ఇలా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సర్కి ళ్లు, డివిజన్ల, సెక్షన్‌లలో పరిధిలో జరిగిన బదిలీలు దక్షిణ డిస్కం రూపొందించిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్నా యని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఒకే డివిజన్‌లో 9 ఏండ్లుగా పనిచేస్తున్న అధికారిని అదే డివిజన్ పరిధిలోనే బదిలీ చేయడంపైనా పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్‌సీపురం ఏడీఈని ఇస్నాపూర్ ఏడీఈగా బదిలీ చేయడాన్ని కొందరు తప్పుపడుతున్నారు.